# ఘట్‌కేసర్ రైల్వే గేటు వద్ద ఘోరం

- రైలు ఢీకొని మహిళ దుర్మరణం
- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ స్థానికుల ఆగ్రహం
- (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి ఫిర్యాదు

**ఘట్ కేసర్, మార్చి 5 (ఆంధ్రప్రభ) :** రైల్వే గేటు దాటుతుండగా రైలు ఢీకొని ఓ మహిళ అతి దారుణంగా మృతి చెందిన ఘటన మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ పట్టణంలో కలకలం రేపింది. అధికారుల నిర్లక్ష్యం, ఏళ్ల తరబడి సాగుతున్న వంతెన పనుల జాప్యమే ఈ ప్రాణం తీసిందంటూ స్థానికులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం పెద్ద పర్వతాపూర్ గ్రామానికి చెందిన బాలమణి (58) బుధవారం పనుల నిమిత్తం ఘట్ కేసర్ రైల్వే గేటు దాటుతుండగా, వేగంగా వచ్చిన రైలు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి ఆమె శరీరం ఛిద్రమై, గుర్తుపట్టలేని స్థితిలో కొంతదూరంలో పడిపోయింది. ఘటనా స్థలంలోనే ఆమె ప్రాణాలు విడిచారు.

**వంతెన జాప్యం.. ప్రజల ప్రాణ సంకటం**

ఏడాది క్రితమే రైల్వే శాఖ ఈ గేటు మీదుగా వాహనాల రాకపోకలను శాశ్వతంగా నిలిపివేసింది. అయితే, పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ వో బి) నిర్మాణం పూర్తికాకపోవడంతో, నిత్యం వందలాది మంది పాదచారులు తప్పనిసరి పరిస్థితుల్లో ఇదే రైల్వే పట్టాలను దాటుతూ ప్రాణాలను పణంగా పెడుతున్నారు.

ఇది కేవలం ప్రమాదం కాదు.. అధికారుల చేతగానితనం వల్ల జరిగిన హత్య అని స్థానిక విద్యార్థి సంఘం నాయకుడు, అడ్వొకేట్ అంకం శ్యామ్ కిరణ్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.(ఎన్.హెచ్.ఆర్.సి)కి ఫిర్యాదు.. కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్‌ఈ ఘటనపై అంకం శ్యామ్ కిరణ్ యాదవ్ జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్.హెచ్.ఆర్.సి)కు ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదులో ప్రధానంగా పలు అంశాలను ప్రస్తావించారు, 17 ఏళ్లుగా సాగుతున్న వంతెన పనులు, వంతెన పూర్తి చేయని కాంట్రాక్ట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి, బాధ్యులైన కాంట్రాక్టర్లను వెంటనే బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి, మృతి చెందిన బాలమణి కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి, వంతెన పనులు పూర్తి కాకుండానే గేటును మూసివేయడం పట్ల స్థానికులు రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా నిద్రమత్తు వీడి యుద్ధ ప్రాతిపదికన వంతెన పనులు పూర్తి చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజల మధ్య ఐక్యత శాంతి ప్రగతికి చిహ్నం

- ఇస్లాం ధర్మం చెప్పేది సమసమాజ స్థాపనే
- కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొత్తకొండ భవాని శంకర్



ఇఫ్తార్ విందుకు హాజరైన నాయకులు

**జవహర్ నగర్, మార్చి 5 (ఆంధ్రప్రభ) :**

మతసామరస్యాన్ని చాటుతూ దేశంలో లౌకిక విలువలను కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని, అందుకు ధార్మిక పండుగలు దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తకొండ భవాని శంకర్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా గబ్బిలాల పేట దేవేందర్ నగర్‌లో మహమ్మద్ ఖలీమ్ నివాసంలో ఇఫ్తార్ విందుకు హాజరైన నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల మధ్య ఐక్యత ఉన్నప్పుడే శాంతి ప్రగతి సాధ్యమన్నారు. కొన్ని శక్తులు ఆర్థిక స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని సమాజంలో ఇలాంటి వ్యక్తులు శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పండుగను ప్రశాంతమైన వాతావరణం జరుపుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, మైనార్టీ అధ్యక్షులు రఫిక్, మత పెద్ద కాన్సాబ్, సాజిద్ హైమద్ పాషా, దస్తగిరి, అక్రమ్ మరియు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# కెరీర్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే

**శామీర్ పేట, మార్చి 5 (ఆంధ్రప్రభ) :** యువతకు విద్యా ఉపాధి అవకాశాలపై మార్గానిర్దేశం చేసే కెరీర్ హ్యాండ్ బుక్‌ను రూపొందించడం అభినందనీయమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం బోయిన్‌పల్లిలోని కార్యాలయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని అలియాబాద్ మున్సిపల్‌లోని పలువురు కౌన్సిలర్లు, లాల్ గడి మలక్‌పేట్, అలియాబాద్ ప్రాంతాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి రాఘవరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన కెరీర్ హ్యాండ్ బుక్ పుస్తకాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు విద్యా, ఉపాధి అవకాశాలపై మార్గనిర్దేశం చేసే ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు సరైన దిశలో ముందుకు సాగేందుకు ఇలాంటి పుస్తకాలు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన తెలిపారు. పుస్తకాన్ని రూపొందించిన సొసైటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ గురక కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు చీదు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బండి లక్ష్మీరాంరెడ్డి, శ్రీకర్ రెడ్డి, వంగ వెంకట్ రెడ్డి, వినయ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మురళి చారి మరియు నగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

# మత్తు పదార్థాల మాయలో పడొద్దు

- ఆరోగ్యమే అసలైన సంపద..
- విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- ఎస్సై హరి ప్రసాద్, డా. సింధూ
- మత్తు వ్యసనాల నివారణలో యువతే ముందుండాలి
- వీ చారిటీ ఫౌండేషన్ చైర్మన్ బండారి శ్రీనివాస్ రెడ్డి

**కీసర, మార్చి 5 (ఆంధ్రప్రభ) :** మత్తు పదార్థాలు, డ్రగ్స్, మత్తు పానీయాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపె విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు కీసర మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. వీ చారిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బండారి శ్రీనివాస్ రెడ్డి సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కీసర పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ (పీడీకే) డాక్టర్ సింధూజ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలు, డ్రగ్స్, మత్తు పానీయాలు యువత ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని తెలిపారు. ఇవి మెదడు, గుండె, కాలేయం వంటి ముఖ్య అవయవాలపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు మానసిక సమస్యలు, అలవాట్లు పెరగడానికి కారణమవుతాయని చెప్పారు. విద్యార్థులు చదువులపై దృష్టి పెట్టి ఇటువంటి చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. డ్రగ్స్, మత్తు పానీయాలు వాడటం వల్ల భవిష్యత్తు నాశనం కావడంతో పాటు నేరాలకు కూడా దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వీ చారిటీ ఫౌండేషన్ చైర్మన్ బండారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు చాలా అవసరమని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే మత్తు వ్యసనాలపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి (రూ.3000) - బోయ విఘ్నేశ్వరి (10వ తరగతి), రెండో బహుమతి (రూ.2000) - సౌభియా (9వ తరగతి), మూడో బహుమతి (రూ.1000) - సీమా భుస్రా (8వ తరగతి), కన్సోలేషన్ బహుమతి (రూ.1000) - జగ్గుల కిరణ్ కుమార్ (10వ తరగతి) అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కీసర మండల బీజేపీ సీనియర్ నాయకుడు మెట్టు మహేందర్ యాదవ్, ఉపాధ్యాయులు కె.రవి చంద్రశేఖర్, ఆర్.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు, రామాదేవి, సుభద్రా దేవి, ఆర్.ఆనంద్, డి.సుశీలత, వై.చంద్రారెడ్డి, పి.చందర్ మరియు ఏపీపీసీ చైర్మన్ జబీనా ఫాతిమా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై హరి ప్రసాద్

# ప్రధాని మోదీ నిర్ణయం అభినందనీయం

**కౌకుంట్ల చంద్రారెడ్డి**

**కీసర, మార్చి 5 (ఆంధ్రప్రభ) :** వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని రేషన్ షాపుల వద్ద ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా మూడు నెలల రేషన్‌ను ఒకేసారి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేద ప్రజలకు మరింత దగ్గరవ్వాలనే లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. దేశంలోని పేదలు, మధ్యతరగతి ప్రజలకు మేలు చేకూరేలా కేంద్ర ప్రభుత్వం ఎన్నో నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా అన్ని వర్గాల ప్రజలను సమానంగా ఆదుకునే విధంగా మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురావడానికి ప్రధాని కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రేషన్ షాపుల వద్ద వందల సంఖ్యలో ప్రజలు క్యూ లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఉండటంతో, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మూడు నెలల రేషన్‌కు ఒకేసారి ఇవ్వాలనే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని కౌకుంట్ల చంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



# ఎస్సీ, ఎస్టీ కులాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది

- పలు శాఖల్లో రిజర్వేషన్లు సక్రమంగా అమలు కావడం లేదు
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్టీ సంఘం అధ్యక్షుడు రవి రాజ్ రాథోడ్

**కీసర, మార్చి 5 (ఆంధ్రప్రభ) :** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న అన్యాయాలు, ముఖ్యంగా ఆర్టీసీలో పనిచేస్తున్న ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై గురువారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ని రాష్ట్ర ఎస్టీ ప్రతినిధి బృందంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు రవి రాజ్ రాథోడ్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవి రాజ్ రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, పలు శాఖల్లో రిజర్వేషన్లు సక్రమంగా అమలు కాకపోవడం వల్ల ఈ వర్గాలు తీవ్రమైన అన్యాయానికి గురవుతున్నాయని కమిషన్ సభ్యుడి దృష్టికి తీసుకువచ్చారు. ప్రత్యేకంగా ఆర్టీసీలో పనిచేస్తున్న ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రమోషన్లలో జరుగుతున్న వివక్ష, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి అంశాలపై వెంటనే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరుగుతున్న అన్యాయాలు, వివక్షను అరికట్టేందుకు జాతీయ ఎస్టీ కమిషన్ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులు కాలరాస్తే సహించబోమని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బీఎంఐ ప్రధాన కార్యదర్శి బట్టు రాజయ్య నాయక్, వై.రమేష్, సూర్య నాయక్, కొమరయ్య, బాలు నాయక్, దేవుసింగ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



**శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**

నమోదిత కార్యాలయం: 501, సల్కాన్ అరుం, జసోలా జిల్లా సెంటర్, కొత్తఢిల్లీ-110025 సిఐఎన్ : యు65900డిఎల్2020పిఎల్‌సి366027

**వేలం ప్రకటన**

శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క దిగువ తెల్పిన రుణగ్రహీతలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంక్ వారి నుండి వారిచే పొందిన బంగారంపై రుణం/లు బ్యాంకు వారిచే జారీచేయబడిన వ్యక్తిగత నోటీసులతో సహా వివిధ డిమాండ్లు మరియు నోటీసులు ఇచ్చినప్పటికి వారిచే సర్దుబాటు చేయబడలేదు రుణగ్రహీతలందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంకు వారితో సెక్యూరిటీగా ఉంచిన బంగారు ఆభరణాలు వేలం వేయుటకు నిర్ణయించబడినది మరియు రుణాలు పొందిన శాఖ ఆవరణలలో తదనుగుణంగా వేలం తేదీన ఉ॥11.00గం॥లుగా నిర్ణయించబడినది. రుణగ్రహీతలతో సహా అందరు ఖాతాదారులు మరియు యావన్మంది ప్రజలు వేలం యొక్క నియమనిబంధనల ప్రకారం ఈ వేలంలో పాల్గొనగలరు.

**వేలం తేది : 16.03.2026న ఉ॥11.00గం॥లకు**

| క్ర.సం. | శాఖ | ఖాతా నెం. | ఖాతాదారుని పేరు |
|---|---|---|---|
| 1 | జూబ్లీహిల్స్ | 103942515307 | వీరపనేని వి.లక్ష్మణ్ |
| 2 | జూబ్లీహిల్స్ | 103942521019 | ప్రియాంక మాతే |
| 3 | జూబ్లీహిల్స్ | 103942521133 | బద్దుల ఎస్ జ్యోతి |
| 4 | జూబ్లీహిల్స్ | 103942520997 | లంకా ఎ రెడ్డి |

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం నుండి ఏదేని ఖాతాను తొలగించుట లేదా వేలం రద్దు చేయుటకు బ్యాంకు వారు హక్కు కలిగి ఉన్నారు.

సం/- అధీకృత అధికారి, శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్